రాష్ట్ర ప్రజలకు
నూతన సంవత్సర శుభాకాంక్షలు

- గవర్నర్, పలువురు మంత్రులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నూతన సంవత్సరం (2024) శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి , సీతక్క, తుమ్మల, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, జూపల్లి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని, బీఎస్‌పీ అధ్యక్షులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాది.. కొత్త ఆశలు.. కొత్త కోరికలు.. కొత్త లక్ష్యాలు.. కొత్త ఆశయాలు.. కొత్త నిర్ణయాలు.. కొత్త వేడుకలు.. కొత్త ఉత్సాహం మీతో కలకాలం ఉండాలని వేర్వేరు ప్రకటనలో ఆకాంక్షించారు. 2024లో ఇంటింటా ఆనందాలు, ప్రతీ కుటుంబంలో అభివృద్ధి కాంతులు వెల్లి విరియాలనీ, రాష్ట్రంలోని అన్ని సామాజిక తరగతులు, వర్గాలు సుస్థిరమైన అభివృద్ధి పథంలో ప్రయాణిస్తుందనీ, ప్రయాణించాలని ఆకాంక్షించారు.

ఎఫ్ఎన్‌సీసీలో ఘనంగా
న్యూ ఇయర్ వేడుకలు

ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. డిసెంబర్ 31 రాత్రి ఏర్పాటు చేసిన ఈ వేడుకలో ఇన్‌ఫ్యూజన్ బ్యాండ్ ఏర్పాటు చేసిన సంగీత విభావరి, బెల్లీ డాన్స్, 30 మంది ముంబై యువకులు చేసిన ఎరోబిక్స్ డాన్స్, జోడీ డాన్స్ ఆహుతులను విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో సినీ, రాజకీయ నాయకులు పాల్గొని 2023 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎఫ్ఎన్‌సీసీ సెక్రెటరీ, నిర్మాత మోహన్ ముళ్ళపూడి మాట్లాడుతూ, "గతంలో ఉన్న కమిటీ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ను ఎంతో అభివృద్ధి చేసింది. మేము కూడా అదే దిశగా ముందుకు తీసుకెళతాం. దక్షిణాదిలో నంబర్ వన్ కల్చరల్ సెంటర్‌గా తీర్చిదిద్దుతా' అని చెప్పారు. ఈ వేడుకలో ఎఫ్ ఎన్ సీ సీ ప్రెసిడెంట్ జి. ఆదిశేషగిరిరావు, వైస్ ప్రెసిడెంట్ తుమ్మల రంగారావు, జాయింట్ సెక్రెటరీ పెద్దిరాజు, ట్రెజరర్ బి రాజశేఖరరెడ్డి, కమిటీ సభ్యులు కాజా సూర్యనారాయణ, కె మురళీమోహన్ , శైలజా జుజల, బాలరాజు, గోపాలరావు, ఏడిద రాజా, మోహన్ వడ్లపట్ల, ఇంద్రపాల్‌రెడ్డి, వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

వనభోజనాలు సర్యూలర్
ఉపసంహరించుకోవాలి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ ఉద్యోగులకు వనభోజనాలు ఏర్పాటు చేయాలనే యాజమాన్య సర్యూలర్‌ను ఉపసంహరించుకోవాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎమ్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే హన్మంతు ముదిరాజ్ డిమాండ్ చేశారు. 97 డిపోల్లో డబ్బులను ఖర్చుపెట్టి కోట్ల రూపాయలు వృధా చేయొద్దని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులకు రావాల్సిన వేతన సవరణలు, బకాయిలు చెల్లిస్తే సంతోషిస్తారని ఆదివారంనాడాక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. గడచిన తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ పాలనలో ఆర్టీసీ ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడ్డారనీ, ప్రగతిభవన్‌లో వనభోజనాలు పెట్టి సంస్థను సర్వనాశనం చేశారని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై సంక్రాంతి కానుకగా శుభవార్త అందించాలని కోరారు.

ఆర్టీసీలో అవే వేధింపులు- కే రాజిరెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా, ఇప్పటికీ మాజీ సీఎం కేసీఆర్ మార్కు వేధింపులే ఆర్టీసీలో కొనసాగుతున్నాయని టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) ప్రధాన కార్యదర్శి కే రాజిరెడ్డి, అడిషనల్ ప్రధాన కార్యదర్శి జీ అబ్రహం విమర్శించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం స్కీం అమలు కోసం ఆర్టీసీ కార్మికులు అనేక కష్ట నష్టాలు పడుతున్నారనీ, వారి ముఖాల్లో సంతోషం నింపేందుకు ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చర్యలు తీసుకోవాలని ఆదివారంనాడాక పత్రికా ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీలో వెల్ఫేర్ కమిటీలను రద్దు చేసి, యూనియన్ కార్యకలాపాలను అనుమతించాలని కోరారు. మాజీ సీఎం కేసీఆర్ పెట్టిన వనభోజనాలను కార్మికులు వ్యతిరేకిస్తున్నారనీ, ఆ నిర్ణయాన్ని యాజమాన్యం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆ సొమ్ముతో నైట్‌అవుట్ సిబ్బందికి రెస్ట్ రూములతో పాటు మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ తమ సంఘం డిపోల వద్ద పెట్టిన బ్యానర్లను తొలగించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న జంట

- మిర్యాలగూడ రైల్వేస్టేషన్ పరిధిలో ఘటన

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

గుర్తు తెలియని యువతీ, యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిన యువతి (25) యువకుడు(30) శనివారం రాత్రి మిర్యాలగూడ రైల్వేస్టేషన్ పరిధిలో 115 మైలు వద్ద ట్రాక్ పై రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఆర్పీఎఫ్ నల్లగొండ సబ్ ఇన్‌స్పెక్టర్ సారలక్క, సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాలను పరిశీలించి పోస్ట్‌మార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియాస్పత్రికి తరలించారు. మృతుల వద్ద రైల్వే టికెట్ మినహా ఎటువంటి ఆధారాలు లేవని, వారి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామని పోలీసులు తెలిపారు. యువతీ, యువకులు భార్యాభర్తలా లేక ప్రేమికులా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి దారుణ హత్య

- రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో యువకుడు దారుణ హత్య

నవతెలంగాణ-శంషాబాద్

గుర్తు తెలియని వ్యక్తుల చేతుల్లో యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని పహడీ షరీఫ్ ప్రాంతానికి చెందిన పీతాంబరం మల్లేష్ (28) పని నిమిత్తం కొన్ని రోజుల క్రితం మండల పరిధిలోని ఘన్సీమియాగుడ గ్రామానికి వచ్చి.. ఓ టెంట్ హౌస్‌లో పనిచేస్తున్నాడు. అలాగే శంషాబాద్ లేబర్ అడ్డా వద్ద కూడా లేబర్ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కాగా, శనివారం అర్ధరాత్రి గ్రామం జాతీయ రహదారి - 44 పక్కన గుర్తుతెలియని వ్యక్తులు ఆ యువకుడ్ని కడుపులో పొడిచి దారుణంగా హతమార్చారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని హత్యకు సంబంధించిన వివరాలు సేకరించారు. క్లూస్ టీం డాగ్ స్క్వాడ్‌తో హత్య జరిగిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మృతుని వద్ద ఉన్న ఫోన్ నెంబర్ ఆధారంగా ఆయన సోదరుడు రాజుకు సమాచారం ఇచ్చారు. మృతుడు మల్లేష్ కర్నాటకకు చెందిన వ్యక్తిగా పోలీసులు నిర్ధారించారు. మృతదేహాన్ని స్వాదీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



జనగణన మళ్లీ వాయిదా

- 2024 అక్టోబర్ వరకూ లేనట్లే
- తాజా నోటిఫికేషన్ విడుదల

న్యూఢిల్లీ : జిల్లాలు, తాలూకాలు, పట్టణాలు, మున్సిపల్ సంస్థలకు పరిపాలనా సంబంధమైన సరిహద్దులు నిర్ణయించేందుకు విధించిన గడువును కేంద్ర ప్రభుత్వం వచ్చే సంవత్సరం జూన్ 30వ తేదీ వరకూ పొడిగించింది. అంటే దీనర్థం జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ కనీసం వచ్చే ఏడాది అక్టోబర్ వరకూ వాయిదా పడే అవకాశం ఉంది. వాస్తవానికి జనగణన కసరత్తు 2020లోనే ప్రారంభం కావాల్సి ఉంది. కోవిడ్, తదితర కారణాలు చూపుతూ ప్రభుత్వం దానిని వాయిదా వేస్తూ వస్తోంది. ప్రభుత్వం చెబుతున్నట్లు 2024 జూన్‌లో (సరిహద్దుల నిర్ణయం తర్వాత) ఈ ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ ఎన్నామరేటర్ల జాబితాను రూపొందించడానికే మూడు నెలల సమయం పడుతుంది. సరిహద్దులను నిర్ణయించేందుకు గతంలో విధించిన గడువును 2024 జూన్ 30వ తేదీ వరకూ పొడిగించడం జరిగిందని భారత అదనపు రిజిస్ట్రార్ జనరల్ శనివారం రాష్ట్రాలకు సమాచారం అందించారు. అంటే లోక్‌సభ ఎన్నికల లోగా జనగణన కసరత్తు ప్రారంభమయ్యే అవకాశాలు లేవన్న మాట. సరిహద్దులను నిర్ణయించేందుకు విధించిన గడువును పొడిగించడం ఇది తొమ్మిదోసారి. గత సంవత్సరంలో తీసుకొచ్చిన 128వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం లోక్‌సభలోనూ, రాష్ట్రాల శాసనసభలలోనూ మహిళలకు మూడో వంతు స్థానాలను రిజర్వ్ చేసే ప్రక్రియ నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే జరగాల్సి ఉంటుంది. చట్టం అమలులోకి వచ్చిన తర్వాత చేపట్టే తొలి ప్రక్రియ ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. ఈ చట్టానికి సెప్టెంబర్ 29నే రాష్ట్రపతి ఆమోదముద్ర పడింది. సెప్టెంబర్ 20న కేంద్ర హోం మంత్రి అమిత్ షా లోక్‌సభలో ఓ ప్రకటన చేస్తూ ఎన్నికల తర్వాతే జనగణన, నియోజకవర్గాల పునర్విభజన జరుగుతాయని స్పష్టం చేశారు. అయితే ఏ సంవత్సరంలో ఇది జరుగుతుందో ఆయన చెప్పలేదు. 1881 నుండి ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి మన దేశంలో జనగణన జరుగుతోంది. ఈ దశాబ్దపు జనగణన తొలి దశ 2020 ఏప్రిల్ 1న ప్రారంభం కావాల్సి ఉంది. అయితే కోవిడ్ కారణంగా దీనిని వాయిదా వేశారు.

ఆ తర్వాత జనగణనలో జరుగుతున్న జాప్యానికి కారణమేమిటో గడచిన మూడు నోటిఫికేషన్లలో కేంద్రం వివరించలేదు. తాజా సమాచారం లేకపోవడంతో 2011 జనాభా లెక్కల నుండి తీసుకున్న సమాచారం ఆధారంగానే ప్రభుత్వం విధానాలను రూపొందించుకుంటోంది. వివిధ వర్గాలకు సబ్సిడీలను కేటాయిస్తోంది. జనగణన మాత్రమే కాకుండా జనన మరణాల నమోదుతో పాటు 2021, 2022, 2023 సంవత్సరాలలో చోటుచేసుకున్న మరణాలకు దారితీసిన కారణాలకు సంబంధించి రెండు కీలక నివేదికలను విడుదల చేయలేకపోయింది.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాలి

- 'ఎంజీఎం' సమీక్షలో మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ - మట్టెవాడ

పేదల ఆస్పత్రి ఉత్తర తెలంగాణకే వరప్రదాయనిగా పేరుపొందిన వరంగల్ ఎంజీఎంలో పేరుకు తగ్గట్టుగా వైద్య సేవల్లో లోటు లేకుండా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఎంజీఎం అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా కరోనా మహమ్మారి నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో కోవిడ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా వరంగల్ ఎంజీఎంలో ప్రజలకు అందిస్తున్న సేవలపై ఎంజీఎం సూపరింటెండెంట్ వి.చంద్రశేఖర్, వివిధ విభాగాల అధిపతులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రిలో అందుతున్న సేవలు, కరోనా వైరస్‌ను ఎదుర్కొనేందుకు ఉన్న సౌకర్యాలపై సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఔషధాల అందుతున్న తీరు, 14 శస్త్ర చికిత్స కేంద్రాల్లో జరుగుతున్న ఆపరేషన్ల తీరుపై ఆరా తీశారు. శుక్రవారం రాత్రి విద్యుత్ అంతరాయంపై సూపరింటెండెంట్‌ను వివరణ అడిగారు. ఆస్పత్రిలో ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అక్కడే ఉన్న టీఎస్ఎన్‌పీడీసీఎల్ వరంగల్ డివిజనల్ ఇంజనీర్‌ను ఆదేశించారు. రెండు నిమిషాలు కూడా కరెంటు కోత అనేది ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. కరోనా వైరస్ తీవ్రం అయిన దృష్ట్యా ప్రస్తుతం ఆస్పత్రి ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. వైరస్ ఉధృతి ఎక్కువయినా రోగులకు ప్రాణవాయువు అందించడంలో ఇబ్బందులు తలెత్తకుండా 1200 ఆక్సిజన్‌తో అనుసంధానం చేసిన బెడ్స్, 3 ఆక్సిజన్ ట్యాంక్స్ సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. విద్యుత్ అంతరాయం తలెత్తినా 5 జనరేటర్ల ద్వారా నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేసేలా సిద్ధంగా ఉంచినట్టు తెలిపారు. ఎంజీఎంకు కావలసిన సౌకర్యాలు ఏమైనా ఉంటే వాటికి సంబంధించి వైద్యారోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపల్ దివ్వెల మోహన్ దాస్, టీఏఎంఐడీసీఎస్ ఈ దేవేంద్ర కుమార్, ఎన్‌పీడీసీఎల్ డీఈ మల్లికార్జున్, ఆర్ఎంఓ మురళి, అడిషనల్ ఆర్ఎంఓలు, ఆస్పత్రి వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

ములుగులో గంజాయి స్వాధీనం

- ములుగు ఎస్ఐ అప్పాని వెంకటేశ్వర్లు

నవతెలంగాణ - ములుగు

ములుగు జిల్లా శ్రీనగర్ క్రాస్ రోడ్ వద్ద ఐదు కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ములుగు ఎస్ఐ ఏ.వెంకటేశ్వర్ తెలిపారు. ఆదివారం ములుగు పరిధిలో తన సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టగా.. రామచంద్రాపురం వైపు నుంచి వస్తున్న తవేరా వాహనంలో నుంచి ఇద్దరు పోలీసులను చూసి పారిపోతుండగా వెంటపడి ఇద్దరిలో ఒకరిని (మహిళ) పట్టుకున్నారు. మరో వ్యక్తి పరారయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాలోని మల్కాజిగిరి జిల్లా నిమ్మలపల్లికి చెందిన దసరా సత్యబతి, ములుగు మండలం మాసింగ్ తండాకు చెందిన మాలోత్ రవితో కలిసి కొంతకాలంగా గంజాయి వ్యాపారం చేస్తోంది. కాగా, ఒడిశా నుంచి కిలో గంజాయికి వెయ్యి రూపాయల చొప్పున కొని వరంగల్‌లో రూ.25,000 అమ్ముతున్నారు. కాగా, కొన్ని రోజుల క్రితం రవి ఫోన్ చేసి 31 డిసెంబర్ రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో గంజాయిని విక్రయించేందుకు ఆర్డర్ ఇచ్చాడు. దాంతో డిసెంబర్ 28న సత్యబతి సుమారు 6 కిలోల ఎండు గంజాయిని తీసుకొని రవి ఇంటికి వెళ్లింది. 30న మధ్యాహ్నం సత్యబతి, రవి కలిసి గంజాయి తీసుకొని రవికి చెందిన తవేరా వాహనంలో గంజాయి విక్రయానికి వెళ్లారు. ఈ క్రమంలో శ్రీనగర్ క్రాస్ రోడ్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. మహిళ వద్ద లభ్యమైన 5.670 కిలోల గంజాయితో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సత్యబతిని రిమాండ్‌కు తరలించారు. పట్టుకున్న గంజాయి విలువ విలువ సుమారు రూ.1,50,000 విలువ ఉంటుందని సీఐ ఎం రంజిత్ కుమార్ తెలిపారు.

అందరికీ ఉచిత విద్య
వైద్యం అందివ్వాలి

- ప్రజా సంక్షేమాన్ని కోరే ప్రభుత్వాలుంటేనే పెన్షన్‌కు గ్యారంటీ
- తప్రా డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలో అందరికీ ఉచిత విద్య, వైద్యం అందించేలా పాలకులపై కొట్లాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి నొక్కి చెప్పారు. దేశంలోగానీ, రాష్ట్రంలోగానీ ప్రజా సంక్షేమాన్ని కోరే ప్రభుత్వాలుంటేనే రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లకు గ్యారంటీ ఉంటుందన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో గల తపాల ఉద్యోగుల కార్యాలయంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్(తప్రా) డైరీ, క్యాలెండర్, ప్యాకెట్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పదేండ్ల కాలంలో కార్పొరేట్లకు రూ.19 లక్షల కోట్ల అప్పులను పాలకులు మాఫీ చేశారని విమర్శించారు. వాటిని గనుక ప్రభుత్వం డిపాజిట్ చేస్తే ఈపీఎఫ్, రిటైర్డ్ బెనిఫిట్స్, పెన్షన్లు ఇవ్వడానికి మంచి స్కీమ్‌ను అమలు చేయొచ్చన్నారు. కానీ, మోడీ సర్కారు అలా చేయకుండా ప్రజలకు ఉపయోగపడే స్కీమ్‌లన్నింటినీ నిర్వీర్యం చేస్తూ పోతున్నదని విమర్శించారు. దేశంలో నాలుగు లక్షల మందికి మేలు చేసే ధోరణిని విడనాడి 142 కోట్ల మందికి అభివృద్ధి ఫలాలు అందేలా నిర్ణయాలు తీసుకోవాలని కేంద్రప్రభుత్వాన్ని కోరారు. దేశంలో మతప్రమేయం లేని రాజకీయాలు రావాలని ఆకాంక్షించారు. నేడు విద్యారంగం సంక్షోభంలో ఉందనీ, పాలకులనే ప్రభుత్వవిద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. దీంతో చిరుద్యోగులు, కూలినాలి చేసుకునేవాళ్లు తమ పిల్లలకైనా మంచి చదువు చెప్పించాలని ప్రయివేటు స్కూళ్లవైపు చూస్తున్నారన్నారు. చదువు అంతరాలను తగ్గించేందుకు దోహదపడాలిగానీ..నేడు ఎన్నిక లక్షల రూపాయలు పెడితే అంత మంచి చదువు అన్నట్టుగా వ్యవస్థ తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. యూఎస్‌లో నూటికి 91 శాతం మంది ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదువుకుంటున్న తీరును వివరించారు. విద్యారంగంలో అంతరాలను పూడ్చుకుంటే దేశంలోని మిగతా అంతరాలను తగ్గించలేమన్నారు. మన దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రభుత్వ స్కూళ్లను పెంచాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. పెన్షనర్లు తమ హక్కుల కోసం అవసరమైనపుడు స్వచ్ఛందంగా సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. తప్రా గౌరవాధ్యక్షులు ఎంఎన్ రెడ్డి మాట్లాడుతూ సుప్రీం కోర్టు డియస్ నకారా కేసు విషయంలో పెన్షనర్ల సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత అని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. పాలకులు పెన్షనర్ల హక్కులను భారంగా కాకుండా బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. తప్రా వ్యవస్థాపక సభ్యులు ప్రభాకర్ నాయర్ మాట్లాడుతూ.. సర్వీసులోని ఉద్యోగులకు ఇస్తున్న వేతనాలకన్నా, రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చే పెన్షన్ ఎక్కువ అవుతోందని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం కొందరు చేయడం సరిగాదన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉండాలనే విషయంగా ఇప్పటి నుంచే ప్రజలకు అర్థం అయ్యేలా పెన్షనర్లు వివరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పోతుల నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు మోతుకూరి నరహరి, అరుణ, కోశాధికారి నాగేశ్వర్‌రావు, జనార్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మార్చిలో మహిళా వికలాంగుల
సాధికారతపై రాష్ట్ర సదస్సు

- హాజరు కానున్న వెయ్యి మంది ప్రతినిధులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహిళా వికలాంగుల సాధికారతపై మార్చిలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని ఎన్‌పీఆర్‌డీ సీనియర్ నాయకురాలు టి వరమ్మ, సంఘం ప్రధాన కార్యదర్శి యం. అడివయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజంలో మహిళా వికలాంగులు అన్ని రంగాల్లో వెనకబడి ఉన్నారని పేర్కొన్నారు. వారిపై లైంగిక వేధింపులు, దాడులు పెరిగిపోతున్నాయనీ, వాటిని అరికట్టెందుకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. మానసిక వికలాంగులను ఆదుకునేందుకు చర్యలు తీసుకువాలని కోరారు. నిరుద్యోగ మహిళా వికలాంగులకు శిక్షణ ఇచ్చి, స్వయం ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఒంటరి మహిళా వికలాంగుల కోసం ప్రతి జిల్లా కేంద్రంలో ప్రత్యేక హోంలను నిర్మించాలని పేర్కొన్నారు. మహిళా సాధికారత గురించి మాట్లాడుతున్న పాలకులు మహిళా వికలాంగుల సాధికారత గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. పని ప్రదేశాల్లో వారిపై వేధింపులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో వారికి ప్రత్యేక వాటా కేటాయించాలని డిమాండ్ చేశారు. సంక్షేమం, సాధికారత, విద్య ఉపాధి, ఆరోగ్యంపై మార్చిలో రాష్ట్ర సదస్సు నిర్వహించి, భవిష్‌త్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. రాష్ట్ర సదస్సుకు 33 జిల్లాల నుంచి వెయ్యి మంది మహిళా వికలాంగులు ప్రతినిధులుగా హాజరవుతారని తెలిపారు. మరోవైపు మహిళా విభాగం రాష్ట్ర స్థాయి సమావేశాన్ని హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. దీనిలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, ఉపాధ్యక్షులు బి స్వామి, సహాయ కార్యదర్శి జె దశరథ్, మహిళా విభాగం రాష్ట్ర కో కన్వీనర్ నాగలక్ష్మి, యశోద, రాష్ట్ర కమిటీ సభ్యులు శశికల, సావిత్రి, దుర్గ, జయలక్ష్మి, సాయిగీత, పార్వతి, కవిత తదితరులు హాజరయ్యారు.

ICICI Home Finance | కార్పొరేట్ ఆఫీసు: ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, ఐసిఐసిఐ హెచ్ఎఫ్‌సి టవర్, ఆంధేరి-కూర్ల రోడ్, ఆంధేరి (ఈస్ట్), ముంబయి-400059, ఇండియా.

బ్రాంచ్ ఆఫీసు: 2వ అంతస్తు, ప్లాట్ నెం.141, విడిఓ కాలనీ, గట్టయ్య సెంటర్, ఖమ్మం-507001.

(రూల్ 8(6) నియమం చూడండి)

స్థిరాస్తుల అమ్మకం కొరకు ప్రకటన

సెక్యూరిటి ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్), రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు ప్రొవిజన్‌తో చదవగల సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(ల)కు తెలియజేయునది ఏమనగా, సెక్యూర్డు క్రెడిటర్‌కు తాకట్టుపెట్టిన/ చార్జ్‌చేసిన దిగువ వివరించి స్థిరాస్తిని ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిచే **భౌతికంగా స్వాధీనంలోకి తీసుకోబడినది**, అవి దిగువ వివరాల ప్రకారం 'ఎక్కడ ఎలా ఉన్నది మరియు అక్కడ అలాగే" ప్రతిపాదికన విక్రయించబడును.

(క్ర. సం.)	రుణగ్రహీత(లు)/ సహ-రుణగ్రహీత(లు)/ హామీదారుల పేరు/ రుణ ఖాతా నెం.	తెలిసిన రుణ భారాలతో సెక్యూర్డు అసెట్స్ యొక్క వివరాలు, ఏవేని ఉన్నచో	బాకీపడిన మొత్తం	రిజర్వు ధర / ధరావత్తు	ఆస్తి తనిఖీచేయు తేది & సమయం	ఇ-వేలం తేది & సమయం
(A)	(B)	(C)	(D)	(E)	(F)	(G)
1.	లకావత్ శ్రీహరి (రుణగ్రహీత), శ్రీలత లకావత్ (సహ- రుణగ్రహీత), రుణ ఖాతా నెంబరు: LHKHA00001397860	సామవరం వైరా మండలం, మరియు మున్సిపాలిటీ, ఖమ్మం జిల్లా, ఎన్‌ఏ ఖమ్మం-507003	రూ. **29,33,601/-** డిసెంబర్ 15, 2023 నాటికి	Rs. 35,49,137/- / Rs. 3,54,920/-	08 జనవరి, 2024న ఉ.11.00 గం.ల నుండి మ.3.00 గం.ల వరకు	19 జనవరి, 2024న మ. 02.00గం.ల నుండి 3.00గం.ల వరకు.

ఆన్‌లైన్ వేలం అనునది మా వేలం ఏజెన్సీ **గ్లోబ్ టెక్** యొక్క వెబ్‌సైట్ (**యూఆర్ఎల్ లింక్**-https://BestAuctionDeal.com) పై నిర్వహించబడును. తాకట్టుదారులు/నోటీసీలకు తదుపరి వడ్డీతో పూర్తి బకాయిలను **18 జనవరి, 2024న సా.5.00గం.లకు** ముందుగా చెల్లింపుకు చివరి అవకాశం ఇవ్వబడినది, లేనిచో ఈ సెక్యూర్డు అసెట్ షెడ్యూలు ప్రకారం విక్రయించబడును.

నిర్దిష్ట బిద్దరుదారులు ధరావత్తు (ఈఎండి)ను ఆర్టీజిఎస్/డిమాండ్ డ్రాఫ్ట్(డిడి) (కాలమ్ ఇ రిఫర్ చేయండి) **18 జనవరి, 2024న సా.4.00గం.లకు** లేదా ముందుగా **ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, 2వ అంతస్తు, ప్లాట్ నెం.141, విడిఓకాలనీ, గట్టయ